ప్రతి అక్షరం ప్రజాహితం

Title code: AP TEL16425.

# ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక


ఎడిటర్: సి యం శ్రీనివాస్, పబ్లిషర్ : అనంతపురం మంగళవారం 21-5-2024 సంపుటి :1 సంచిక :261 పేజీలు : 4 వెల : 5-00

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక



## దేశవ్యాప్తంగా ఐదో దశ పోలింగ్

- పలు ప్రాంతాల్లో ఓటేసిన ప్రముఖులు
- అమేథీలో స్మృతి, లక్నోలో రాజ్‌నాథ్, మాయావతిలో ఓటు
- ముంబైలో ఓటేసని అక్షయ్ కుమార్, జాన్వీ

2లో




## ఎపిలో జగన్‌కు ఓటమి తప్పదు

దేశంలో మరోమారు మోడీదే అధికారం

ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అంచనా




## బెంగళూరు రేవ్ పార్టీలో నేను లేను

- నేను ఇంట్లోనే నిక్షేపంగా ఉన్నా
- నిజాలు తెలుసుకుని వివరాలు ఇస్తే మంచి
- వీడియో సందేశం విడుదల చేసిన నటుడు శ్రీకాంత్

# వ్యూహం ప్రకారమే దాడులు

రాజకీయనాయకుల ప్రోద్బలంతో పోలీసుల ప్రేక్షకపాత్ర

మూడు జిల్లాల్లో దాదాపు 33 హింసాత్మక ఘటనలు

33 కేసుల్లో ఎఫ్ఐఆర్ ప్రకారం 1,370 మంది నిందితులు

ఎపి ఎన్నికల హింసపై సిట్ నివేదిక

డిజిపి గుప్తాకు అందచేసిన సిట్ చీఫ్ బ్రిజ్‌లాల్




అమరావతి,మే 20 ఆంధ్రప్రగతి, ఏపీలో ఎన్నికల పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసపై సిట్ తన ప్రాథమిక నివేదికను డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు అందించింది. ఈ నివేదికను సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ డీజీపీకి అందజేశారు. మూడు జిల్లాల్లో రెండు రోజుల పాటు పర్యటించిన ఈ బృందం.. ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక దర్యాప్తు కొనసాగించింది. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో 33 హింసాత్మక ఘటనలు జరిగినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ అధికారులు గుర్తించారు. ఈ దమనకాండపై రెండు రోజులపాటు విచారణ జరిన సిట్.. అల్లర్లు జరిగిన ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి విచారణ జరిపింది. రాష్ట్రంలో హింసాత్మక ఘటనలపై సిట్ ఇచ్చిన 150 పేజీల నివేదికలో పలు కీలకాంశాలను పొందు పరిచింది. మూడు జిల్లాల్లో దాదాపు 33 హింసాత్మక ఘటనలు జరిగినట్లు తేల్చింది. పల్నాడు జిల్లాలోని 3 అసెంబ్లీ స్థానాల్లో 22 కేసులు, అనంతపురం జిల్లా తాడిపత్రిలో 7 కేసులు, తిరుపతి జిల్లాలోని 2 అసెంబ్లీ స్థానాల్లో 4 కేసులు నమోదైనట్లు సిట్ వెల్లడించింది. క్షేత్రస్థాయిలో పోలీసులు, బాధితులు, ఇతర వర్గాల నుంచి సాక్ష్యాలు సేకరించి నివేదిక రూపొందించినట్లు పేర్కొంది. 33 కేసుల్లో ఎఫ్ఐఆర్ ప్రకారం 1,370 మంది నిందితులుగా ఉన్నారని,

# ఇరాన్ అధ్యక్షుడు రైసీ దుర్మరణం

- అధ్యక్షుడితో పాటు విదేశాంగమంత్రి కూడా మృతి
- హెలికాప్టర్ ప్రమాదంలో మరణించినట్లు ధృవీకరణ
- అజర్‌బైజాన్ లో ప్రతికూల వాతావారణంతో కూలిన ఛాపర్
- ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి..ఇరాన్ ప్రజలకు సానుభూతి



టెహ్రాన్,మే20ఆంధ్రప్రగతి, :హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ దుర్మరణం చెందారు. ఈ విషయాన్ని స్థానిక మీడియా ధృవీకరించింది. అధ్యక్షుడితో పాటు ఆ దేశ విదేశాంగ మంత్రి కూడా ఈ ఘటనలో చనిపోయారు. ఓ ఆనకట్ట ప్రారంభానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో.. ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ అదుపు తప్పి, తూర్పు అజర్‌బైజాన్ సరిహద్దుల్లోని జోల్ఫా ప్రాంతంలో కుప్ప కూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్ మొత్తం కాలిపోవడంతో.. అందులో ఉన్న వ్యక్తులందరూ ప్రాణాలు విడిచారు

- మిగతా 2లో పేజిలో

## బాధితుల గొంతు వినిపిస్తే కేసులా

కంచర్లపాలెం పోలీసుల తీరు దారుణం

మాజీమంత్రి దేవినేని ఉమ విమర్శలు




## విశాఖ కంచరపాలెం ఘటన దారుణం

- ఎన్నికల సంఘానికి అచ్చన్నాయుడు లేఖ
- కఠిన చర్యలు తీసుకోవాలని వినతి




# ఇళ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

– తొలిదశలో అత్యంత పేదలకు అవకాశం – అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు

-అన్యాయంగా కార్డు ఉన్నవారు సరెండర్ చేయాలి

-ప్రజల వద్దకే శ్రీనన్న కార్యక్రమంలో మంత్రి పొంగులేటి



ఖమ్మం,మే 20ఆంధ్రప్రగతి, తెలంగాణాలో మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామని, ఇళ్ళు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళు ్ళ ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. గ్రామంలో ఉన్న పాఠశాల, రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం త్వరలోనే పూర్తి చేపిస్తామన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు ఇస్తామన్నారు. అయితే అక్రమంగా కార్డులు ఉన్నవారు, అర్హత లేకున్నా పొందిన వారు స్వచ్ఛందంగా కార్డులు వాపస్ చేయాలన్నారు. పాలేరు నియోజకవర్గం తన సొంత ఇల్లు అని, ఎన్నికల కోడ్ అయిపోగానే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మొదలవుతాయన్నారు. ఖమ్మం రూరల్ మండలం, రెడ్డిపల్లి, పోలేపల్లి లో నిర్వహించిన ప్రజా సమస్యలపై ప్రజల వద్దకే శ్రీనన్న కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ

- మిగతా 2లో పేజిలో

- మాదక ద్రవ్యాలు వినియోగించినట్లు గుర్తింపు
- పార్టీలో పాల్గొన్న ప్రముఖులు, టీవి,సినీ నటులు
- వందమందికి పైగా అరెస్ట్..పలు ఖరీదైన కార్లు స్వాధీనం
- మంత్రి కాకాణి గోవర్ధన్ స్టిక్కర్ లభ్యం
- రేవ్ పార్టీలో పాల్గొనలేదని నటి హేమ

# బెంగళూరు శివారులో రేవ్ పార్టీ



# ముందస్తు వ్యూహం ప్రకారమే దాడులు

(మొదటి పేజి (తరువాయి)

ఇప్పటి వరకు 124 మంది అరెస్టయ్యారని తెలిపింది. మిగతావారినికూడా అరెస్ట్ చేయాలని సూచించింది. రెండు వర్గాల ఘర్షణలు మరణాలకు కారణమై ఉండేవని తేల్చింది. కేసుల దర్యాప్తులోనూ తీవ్ర లోపాలు గుర్తించినట్లు సిట్ తన నివేదికలో పేర్కొంది. మరోవైపు నమోదైన ఎఫ్ఐఆర్‌లో కొత్త సెక్షన్లు చేర్చే అంశంపైనా సిట్ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలా? వద్దా అనే అంశంపైనా నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. హింస జరుగుతుందని తెలిసీ కొందరు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా సిట్ నిర్ధరించింది. స్థానిక నేతలతో కుమ్మక్కైన పోలీసులు హింస జరుగుతున్నా.. మిన్నకుండిపోయారని ఈ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కొందరు పోలీస్ అధికారులపైనా కేసులు నమోదు చేసే అవకాశం కనబడుతోంది. ఈ ఘటనల్లో ఉపయోగించిన రాళ్లు, కర్రలు, రాడ్లు వంటి సామగ్రికి సంబంధించిన ఆధారాలూ సేకరించిన సిట్.. ఈ ఘటనలతో సంబంధం ఉన్న పలువురు రాజకీయ నేతల్ని సైతం అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలపైనా కొన్ని సిఫారసులు చేసినట్లు తెలుస్తోంది. ఈ నివేదికను డీజీపీ.. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ప్రభుత్వం ద్వారా అందించనున్నారు. ఈ ఘటనలపై పూర్తి నివేదికను ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని సిట్ కోరే అవకాశం ఉంది. ఏపీలో ఎన్నికలకు ముందు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 13 మంది సభ్యులతో సిట్ బృందాన్ని ప్రభుత్వం నియమించింది. హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాల్లో సిట్ విచారణ పూర్తి చేసింది. సోమవారం సాయంత్రం డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో సిట్ సారథి వినీత్ బ్రిజ్ లాల్ భేటీ అయ్యారు. 150 పేజీలతో సుదీర్ఘ నివేదికను వినీత్ బ్రిజ్ లాల్ డీజీపీ కి సమర్పించారు. ఇప్పటికే పలు స్టేషన్లలో వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యారు. ఘర్షణ తీవ్రతను బట్టి పలు ఠాణాల్లోని నమోదైన కేసులకు సంబంధించి కొన్ని సెక్షన్లు మార్పులు చేయాలని సిట్ నివేదికలో ఉన్నట్లు.. కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే అంశాన్ని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ దమనకాండపై రెండు రోజులపాటు అల్లర్లు జరిగిన ప్రాంతానికి వెళ్లి విచారణ జరిపింది. ప్రతి అంశాన్ని సిట్ అధికారులు పరిగణలోకి తీసుకున్నారు.

# ఇళ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజి (తరువాయి)

సమావేశంలో ప్రజలనుంచి మంత్రి సమస్యలు అడిగితెలుసుకుంటున్నారు. గ్రామాల్లో సమస్యలపై మంత్రి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రాలు అందజేసిన ప్రజలు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రజలకు మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. మీ అందరి దీవెనలతో ఎమ్మెల్యేగా గెలిచానని, అడిగిన సమస్యలే కాకుండా అడగని సమస్యలు కూడా పరిష్కరిస్తాని చెప్పారు. ప్రజలు అడిగిన కోరికలు తీర్చే బాధ్యత తనదన్నారు. భవిష్యత్‌లో ఏ సమస్య వచ్చినా ఇందిరమ్మ కమిటీ ద్వారా తనకు తెలియచేయాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని మీ పెద్ద కొడుకుగా పనిచేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి నా గెలుపు కోసం శ్రమించి పనిచేసి అద్భుతమైన మెజారిటీతో గెలిపించారు. మీ ఇంటి పెద్దకొడుకుగా మీ అందరి కోసం పనిచేస్తా' అని రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో నిర్వహించిన ప్రజల వద్దకె శ్రీనన్న కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రఘురాం రెడ్డి గెలుపు కోసం కూడా అందరూ కృషి చేశారన్నారు.
ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం లేకుండానే ఈ ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తానని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పేదలకు ఒక్క ఇళ్ళు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పాలేరు నియోజకవర్గం తన సొంత ఇల్లు అని తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాల్లో పాలేరు నియోజకవర్గంలో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా పేద వాళ్లలో అతి పెదవాళ్ళకి ఇళ్ళు ఇవ్వాలన్నది ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలేరులో ఏ ఒక్కరూ మంచినీటికి ఇబ్బంది పడకుండా చర్యలు చేపడతామన్నారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు నిర్మాణం చేస్తామని చెప్పారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. నిజమైన పేదవారికి సేవ చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మరోసారి స్పష్టం చేశారు. వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. పాలేరు ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని పోగొట్టుకోనన్నారు. ఎన్నికలు ఉన్నా.. లేకపోయినా నిత్యం పాలేరు ప్రజల మధ్యే ఉంటానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా ఐదో దశ పోలింగ్

న్యూఢిల్లీ,మే2 దేశ వ్యాప్తంగా 5వ దశ లోక్ సభ ఎన్నికలకు పోలింగ్ సోమవారం ఉదయం ప్రారంభమయ్యింది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 49 నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు సినీ రాజకీయ ప్రముఖులు తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుత బీజేపీ సిట్టింగ్ ఎంపీ స్మృతి ఇరానీ అమేథీ లోక్‌సభ స్థానం నుంచి మరోసారి లోక్ సభ స్థానానికి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె అమేథీలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'ఈరోజు తన గ్రామం గౌరీగంజ్‌లో వికసిత్ భారత్ సంకల్పంతో తన ఓటు వేయడం జరిగిందన్నారు. ఇది తన అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోండి.. దేశ భవిష్యత్తుకు బాధ్యతగా ఓటు వేయమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఉత్తరప్రదేశ్ లో కూడా పలు స్థానాలకు పోలింగ్ పక్రియ ప్రారంభమైంది.

# బెంగళూరు శివారులో రేవ్ పార్టీ

బెంగళూరు,మే20 బెంగళూరు శివారులో నిర్వహించిన రేవ్ పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు పట్టుబడ్డారు. ఓ వ్యాపారవేత్తకు చెందిన ఫామ్ హౌస్‌లో బర్త్ డే పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాడి చేశారు. దాదాపు 100
మందికి పైగా పార్టీకి హాజరయ్యారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే పార్టీకి వచ్చిన ఓ కారులో ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సంబంధించిన స్టిక్కర్ దొరికింది. పార్టీలో పలు రకాల డ్రగ్స్ వాడినట్లు పోలీసులు గుర్తించారు. 17 గ్రాముల ఎండీఎంఏ పిల్స్, కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫామ్ హౌస్ పరిసరాల్లో జాగ్వార్, బెంజ్ సహా ఖరీదైన 15 ఖరీదైన కార్లను జప్తు చేశారు. ఐదుగురిని అరెస్టు చేసిన ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ రేవ్ పార్టీలో లిక్కర్ తో పాటుగా పెద్ద ఎత్తున డ్రగ్స్ కూడా లభ్యం అయ్యాయి. జీఆర్ ఫామ్‌హౌస్ అనేది హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యక్తికి చెందినది తేల్చారు. ఈ పార్టీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నట్లు బెంగుళూరు పోలీసులు గుర్తించారు. టీవీ నటులు సహా, మోడల్స్, పలువురు వ్యాపార, రాజకీయ వారసులు కూడా రేవ్ పార్టీలో పాల్గొన్నట్లుగా చెబుతున్నారు. సీసీబీ సోదాల్లో ఎండీఎంఏ సహా పలు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. జాగ్వార్ లాంటి ఖరీదైన కార్లతో పాటు మొత్తం ఐదుగురిని సీసీబీ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బెంగళూరు శివారులో నిర్వహించిన రేవ్ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలుగు సినీనటి హేమ స్పష్టం చేశారు.

# బెంగళూరు రేవ్ పార్టీలో నేను లేను

బెంగళూరు,మే 20
బెంగళూరు శివారు ప్రాంతంలో నిర్వహించిన రేవ్ పార్టీలో తెలుగు సినీ నటుడు శ్రీకాంత్ ఉన్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఆ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తానసలు ఆ పార్టీకే వెళ్లలదేని శ్రీకాంత్ స్పష్టం చేశారు.
ఈ విషయంపై ఆయన వివరణ ఇస్తూ తన ఇంట్లో నుంచే ప్రత్యేకంగా వీడియోను రికార్డ్ చేసి విడుదల చేశారు. ఆ వీడియోలో శ్రీకాంత్ మాట్లాడుతూ 'నేను హైదరాబాద్‌లోని మా ఇంట్లోనే ఉన్నా, బెంగుళూరు రేవ్ పార్టీకి నేను వెళ్లినట్లు, నన్ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు నాకు ఫోన్ కాల్స్ వచ్చాయి. కొన్ని వీడియో క్లిప్స్ చూశా, కొంతమంది మీడియా మిత్రులు నాకు ఫోన్ చేసి క్లారిటీ తీసుకోవటంతో నాకు సంబం ధించిన వార్తలను వారు రాయలేదు. అయితే కొన్నింటిలో మాత్రం నేను బెంగుళూరులోని రేవ్ పార్టీకి వెళ్లానని వార్తలు వచ్చాయి. ఆ న్యూస్ చూసి నాతో సహా మా కుటుంబ సభ్యులందరూ నవ్వుకున్నాం అని శ్రీకాంత్ అన్నారు. మొన్న ఈ మధ్య నా భార్యతో నాకు విడాకులు ఇప్పించేశారు, ఇప్పుడేమో రేవ్ పార్టీకెళ్లానని అన్నారు, అయితే వార్తలు రాసిన వాళ్లు తొందపడటంలో తప్పులేదనిపించింది.

# విశాఖ కంచరపాలెం ఘటన దారుణం

అమరావతి,మే 20 :విశాఖ కంచరపాలెంలో తమకు ఓటు వేయలేదన్న కారణంతో ఓ కుటుంబంపై వైకాపా శ్రేణులు దాడి చేసిన ఘటనపై కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి, డీజీపీకి తెదేపా ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు లేఖ రాశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు.. ఘటనకు సంబంధించిన వార్తలను ప్రసారం చేసిన సంస్థలపై కేసులు పెట్టడాన్ని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. మీడియాపై కేసులు ఎత్తివేసి, కేసును తప్పుదారి పట్టించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం పలు ప్రాంతాల్లో జరిగిన హింసపై ఈసీ జోక్యం చేసుకోవడంతోనే పరిస్థితులు అదుపులోకి వచ్చాయని లేఖలో పేర్కొన్నారు. విశాఖ ఘటనలో బాధితుల గళం వినిపించిన ఈటీవీ, ఏబీఎన్ సిబ్బందితో పాటు భాజపా నేత విష్ణుకుమార్ రాజుపైనా కేసులు నమోదు చేశారని చెప్పారు. ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను ప్రసారం చేయడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు.

# ఇరాన్ అధ్యక్షుడు రైసీ దుర్మరణం

(మొదటి పేజి (తరువాయి)

ప్రస్తుతం అక్కడ ఇతర సహాయక చర్యలు కొన సాగుతున్నాయి. ఆదివారం ఉదయం అజర్‌బైజాన్ సమీపంలో ఇరుదేశాలు సంయుక్తంగా నిర్మించిన ఓ ఆనకట్ట ప్రారంభోత్సవానికి ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ వెళ్లారు. ఆ కార్యక్రమం ముగించుకొని అధ్యక్షుడు హెలికాప్టర్‌లో తబ్రిజ్ నగరానికి తిరుగు పయనమయ్యారు. అయితే.. భారీ పొగమంచు మధ్య పర్వతప్రాంతాలను దాటుతున్న సమయంలో హెలికాప్టర్ అదుపు తప్పి, జోల్ఫా ప్రాంతంలో నేలను బలంగా తాకింది. దీంతో.. హెలికాప్టర్‌లో మంటలు చెలరేగి, పూర్తిగా దగ్ధమైంది. హెలికాప్టర్ గల్లంతైన విషయం తెలియగానే.. అధికారులు అప్రమత్తమై దాని ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రతికూల వాతావరణ నేపథ్యంలో సహాయక చర్యలకు ఆటంకం ఏర్ప డింది. మానవరహిత విమానాల ద్వారా ప్రమాద స్థలాన్ని గుర్తించి.. సోమవారం ఉదయం రెస్క్యూ బందాలు అక్కడికి చేరుకున్నాయి.

ఇబ్రహీం రైసీ మృతితో ఇరాన్‌లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ సుప్రీం అయతుల్లా ఖమేనీకి ఇబ్రహీం రైసీ అత్యంత సన్నిహితుడు. 2021 అధ్యక్ష ఎన్నికల్లో ఆయన గెలుపొందారు. అయితే.. తన ప్రత్యర్థుల్ని పక్కకు తప్పించి, ఆయన తక్కువ ఓటింగ్‌తో ఈ ఎన్నికల్లో గెలుపొం దడం.. అప్పట్లో తీవ్ర వివాదాస్పద మైంది. ఖమేనీకి వారసుడిగా గుర్తింపు పొందిన ఇబ్రహీం.. 1988లో ఖైదీలను సామూహికంగా ఉరితీసినందుకు ఆంక్షల్ని ఎదుర్కొంటున్నారు. తాను అధ్యక్షుడిగా అధికారం చేపట్టినప్పటి నుం చి ఇరాన్‌లో ఇస్లామిక్ చట్టాలను కఠినతరం చేయాలని ఆదేశించారు. తన హయాంలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనల్ని ఉక్కుపాదంతో అణచివేశారు. ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారుస్తానని పదేపదే చెప్పేవారు. హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మృతిపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రగాఢ సంతాపం తెలిపారు.


# బాధితుల గొంతు వినిపిస్తే కేసులా

అమరావతి,మే 20 బాధితుల గొంతు వినిపించిన మీడియా స్వేచ్ఛపై కంచర్లపాలెం పోలీసులు దాడి చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. స్వామి భక్తి కోసం అక్రమ కేసులు పెడుతున్న కంచర్లపాలెం పోలీసుల తీరును దేశం మొత్తం చూస్తోందన్నారు. తప్పుడు కేసులు పెట్టిన కంచర్లపాలెం పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. తాడేపల్లి ఆదేశాల మేరకు సీఎస్ నేతృత్వంలోనే ఈ కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మహిళలపై జరిగిన దాడిని లైవ్‌లో చూపించారని, సీఎం, సజ్జల డైరెక్షన్‌లోనే మీడియాపై అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎపిలో జగన్‌కు ఓటమి తప్పదు


న్యూఢిల్లీ,మే 20( ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్ఆర్ సీపీ అధికారంలో కొనసాగబోదని ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. ఏపీలోని అధికార పార్టీకి ఘోరమైన పరాజయం ఎదురు అవుతుందని తేల్చి చెప్పారు. తాము కచ్చితంగా గెలుస్తామని.. సీఎం జగన్ మోహన్ రెడ్డి చెప్పినా ఫలితం ఉండబోదని అన్నారు. ఆయన నమ్మకం వ్యక్తం చేసినట్లుగానే రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ లాంటివారు కూడా చెబుతున్నారని.. వారి పార్టీలు ఎన్నికల్లో గెలవబోవని చెప్పారు. ప్రముఖ జర్నలిస్టు బర్కాదత్‌కు ఢిల్లీలో ఆదివారం ప్రశాంత్ కిషోర్ ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిషోర్ తాజా వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల ఫలితాల్లో నా అంచనాలు తప్పయితే నా ముఖంపై పేడ పడుతుంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో నాతో సవాలు చేసిన అమిత్ షా ముఖంపై పేడ పడింది. అలాగే జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల అవుతాయి. నేను చెప్పింది నిజమైతే జగన్ మోహన్ రెడ్డి ముఖంపై పేడ పడుతుంది.. లేదంటే నాపై పడుతుందని ప్రశాంత్ కిషోర్ అన్నారు.ఎన్నికల ముందే ఓటమిని ఏ రాజకీయ నాయకుడు కూడా అంగీకరించరని పీకే తెలిపారు. తాను పదేళ్లకు పైగానే ఎన్నికల క్షేత్రంలో పని చేస్తున్నానని చెప్పారు. ఓట్ల లెక్కింపు రోజు నాలుగైదు రౌండ్లు పూర్తయిన తర్వాత వరకు కూడా రాజకీయ నాయకులు ఓటమిని అంగీకరించబోరని చెప్పారు. రాబోయే రౌండ్లలో తమకే మెజారిటీ వస్తుందనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేస్తుంటారని చెప్పారు.

## ప్రశాంతమైన పల్నాడుని వల్లకాడు చేశారు: ధూళిపాళ్ల



అమరావతి: అధికారులను మార్చిన చోటే ఘర్షణలు జరిగాయని వైకాపా ఆరోపిస్తోందని తెదేపా నేత ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. ప్రశాంతంగా ఉన్న పల్నాడును వైకాపా నేతలు వల్లకాడు చేశారంటూ మండిపడ్డారు.కొందరు పోలీసులు వైకాపాతో కుమ్మక్కై తెదేపా కార్యకర్తలపై దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. ఎవరు ఎవరిపై దాడి చేశారో వీడియోలు, ప్రజల సాక్ష్యాలు ఉన్నాయని చెప్పారు. అధికారం కోల్పుతున్నామనే అక్కసుతోనే వైకాపా నేతలు దాడులకు తెగబడు తున్నారని.. ఎన్నికల్లో గెలవాలని ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ఓటమి భయంతో ప్రతిపక్షాలు, పోలీసులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు.

# ఆప్ రూ.7.08 కోట్ల విదేశీ నిధులను సేకరించింది: ఈడీ




ఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ 2014 నుంచి 2022 వరకు రూ.7.08 కోట్ల విదేశీ నిధులను పొందిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ఆరోపించింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టంలను ఆప్ ఉల్లంఘించిందని అధికారులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు తెలియజేశారు.ఆప్ నాయకులు విదేశీ నిధుల సేకరణలో పలు అవకతవకలకు పాల్పడ్డారని, కెనడాలో సేకరించిన నిధులను ఆ పార్టీ ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్‌తో సహా వారిలో కొందరు తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకున్నారని అధికారులు తెలిపారు.

ఒకే నంబర్లకు విరాళాలు

దర్యాప్తు సంస్థ తెలిపిన వివరాల ప్రకారం అనేకమంది దాతలు ఒకే పాస్‌పోర్ట్ నంబర్‌లు, మెయిల్ ఐడీలు, మొబైల్ నంబర్‌లు, క్రెడిట్ కార్డ్‌లకు పార్టీ ఫండ్ అందించారు. వీటికి సంబంధించిన వివరాలను దర్యాప్తు సంస్థ సేకరించింది. ఈడీ ప్రకారం విదేశాల్లో నివసిస్తున్న 155 మంది 55 పాస్‌పోర్ట్ నంబర్‌ల ద్వారా మొత్తం రూ.1.02 కోట్లు, 71 మంది దాతలు 21 మొబైల్ నంబర్‌లను ఉపయోగించి మొత్తం రూ.99.90 లక్షలు, మరో 75 మంది 15 క్రెడిట్ కార్డుల ద్వారా రూ.19.92 లక్షల విరాళాలను అందించారు.విదేశీ దాతల గుర్తింపు, జాతీయతలతో పాటు విదేశీ విరాళాలకు సంబంధించిన అనేక ఇతర వాస్తవాలను పార్టీ నేతలు దాచిపెట్టారని, అక్రమ మార్గంలో విరాళాలను సేకరించారని అధికారులు వెల్లడించారు. యూఎస్, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఆప్ ఓవర్సీస్ ఇండియా అనే సంస్థను ఏర్పాటుచేసిందని, పార్టీకి నిధులను సమీకరించడం దీని ప్రాథమిక పని అని పరిశోధనల్లో తేలిందన్నారు.


# ఈ.వి.ఎం.ల స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రత

**-జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 20:
ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్స్ భద్రతలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిలు కమాండ్ కంట్రోల్ రూంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం పాణ్యం మండలం నెరవాడ గ్రామం సమీపంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములలో భద్రపరచిన ఈవీఎంల పర్యవేక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ.వి.ఎం.లను భద్రపరచిన ఇంజనీరింగ్ కళాశాలల వద్ద కేంద్ర బలగాలు, ఆర్మ్డ్ రిజర్వు, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. భద్రతా సిబ్బందిగా ఉన్న ప్రతి ఒక్కరూ వెపన్ లేదా లాఠీలతో పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూముల డోర్ లకు అదనపు భద్రత నిమిత్తం ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ నిమిత్తం వచ్చే అభ్యర్థులు లేదా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి ఒక్కరు సంబంధిత రిటర్నింగ్ అధికారి గుర్తింపు కార్డుతో పాటు వ్యక్తిగత ధ్రువీకరణ కార్డును కూడా చెక్ చేసి అనుమతించాలని పోలీస్ బందోబస్తు సిబ్బందిని ఆదేశించారు. అంతే కాకుండా, కళాశాలలకు వెళ్లే మార్గాల్లో వాహనాలను కూడ తనిఖీ చేయాలన్నారు. వచ్చే వ్యక్తుల వివరాలను రిజిస్టరుల్లో నమోదు చేయాలన్నారు. ఈ.వి.ఎం.ల భద్రత నిమిత్తం డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు నిరంతరం పర్యవేక్షించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. విధుల్లో అలసత్వం లేకుండా పహారా వుండడంతో పాటు విశ్రాంతిలో ఉన్న సిబ్బంది కూడా ఆయా పరిసర ప్రాంతాల్లోనే అందుబాటులో ఉండాలని కలెక్టర్, ఎస్పీలు ఆదేశించారు.

## పశువులకు వ్యాధి నిరోధక టీకాలు.



ఆంధ్ర ప్రగతి మహానంది మే 20:
పశువులకు గొంతు వాపు వ్యాధి రాకుండా నిరోధక టీకాలు వేస్తున్నట్లు వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కె. సులోచన అన్నారు. సోమవారం మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో పశువులకు గొంతు వాపు నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశు వైద్యశాల ద్వారా గొంతు వాపు నిరోధక టీకాలు, నల్ల జాతీయ పశువులకు,ఆవులకు, కోడె దూడలకు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహానందిలో పోటెత్తిన భక్తులు.



ఆంధ్ర ప్రగతి మహానంది, మే 20:
మహానంది పుణ్యక్షేత్రంలో సోమ వారం భక్తులు పోటెత్తారు. వరుసగా సెలవు దినాలు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల చెందిన భక్తులే కాక, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాది సంఖ్యలో మహానందికి తరలివచ్చారు. తెల్లవారుజామున నుండే భక్తులు కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి, శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని, అభిషేకం కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు స్వామి అమ్మవార్ల దర్శనం నిర్విరామంగా కొనసాగింది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## ఘనంగా స్వామి అమ్మవార్ల పల్లకి సేవ.



ఆంధ్ర ప్రగతి మహానంది, మే 20:మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి ఆలయ వేదపండితులు పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మంటపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలకు వేదపండితులు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పల్లకిపై ఆలయం పురవీధుల గుండా పల్లకిసేవను నిర్వహించారు. ఈ పల్లకి ఉత్సవ కార్యక్రమంలో భక్తులు పాల్గొని, స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

# కుందు పరివాహక ప్రాంతాల ప్రజలకు ముంచుకొస్తున్న ముప్పు..!

**●డంపింగ్ యార్డ్ కాంట్రాక్టర్ అంటే అధికారులకు ఎందు కంత ప్రేమో.?**

**●డంపింగ్ యార్డ్ వ్యర్థాలు కుందూ పరీవాహక ప్రాంతాల్లో నిల్వలు.**

**●భారీ వర్షాలు పడితే వ్యర్థాలు కుందూ లో కలిస్తే.**

**●కుందూ నీరు కలుషితమైతే ప్రజలు అనారోగ్యాలకు గురికారా.?**

**●కుందూ ప్రాంతాల్లో 1500 లారీల వ్యర్థాలు తొలారా.?**

**●ల ప్రాణాలతో మా కేంటి.?**

**●కాంట్రాక్టర్ కు మొదటి బిల్లు వస్తె చాలు..మేము బాగుంటాం.**





ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 20:
వర్షాలు పడుతున్నాయని సంతోషించాలో,భారీ వర్షాలు పడితే డంపింగ్ యార్డ్ వ్యర్థాలు కుందూ లో కలిస్తే నీరు కలుషితం అవుతుందని కుందు పరీవాహక ప్రాంతాలు క్షణ,క్షణం భయం,భయంగా గడుపుతున్నారు. కుందూ ప్రాంతంలో మూడు చోట్ల డంపింగ్ యార్డ్ వ్యర్థాలు నిల్వ వుండడంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారు. డంపింగ్ యార్డ్ కాంట్రాక్టర్ యార్డ్ లోని వ్యర్థాలు కుందూ ప్రాంతాల్లో తరలిస్తున్న కాంట్రాక్టర్ అంటే ఎందుకు అంత ప్రేమో అర్థం కావడం లేదు. ప్రజల ప్రాణాలతో మాకేంటి పని కాంట్రాక్టర్ కు మొదటి బిల్లు వస్తె చాలు మేము బాగుపడ తామనే దొరణలో అధికారులు ఉన్నట్లు సమాచారం. నలుగురు అధికారులు మొదటి బిల్లు వచ్చేందుకు శతవిదాలుగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. మొదటి బిల్లు తయారుచేయడానికి గుంతకల్లు కాంట్రాక్టర్ సహాయకుడితో బిల్లు తయారుచేస్తున్నట్టు సమాచారం. ఆ సేవకుడికి సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఆలోచించండి,డంపింగ్ యార్డ్ వ్యర్థాలు కుందూ లో కలవక ముందే జాగ్రత్తలు తీసుకోండి. ప్రజలు కలుషిత నీళ్ళు తాగి అనారోగ్యాల పాలు కాకముందే మేలుకోండి. రాజకీయ నాయకులు ఓట్లు,పదవి పై పెట్టే శ్రద్ధ కాసింత ప్రజల ప్రాణాలు కాపాడేందుకు దృష్టి పెట్టండి. వివరాల్లోకి వెళితే నంద్యాల పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో కాల్వల్లో మట్టి,చెత్తా,చెదారం మున్సిపల్ సిబ్బంది సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలిస్తారు. డంపింగ్ యార్డ్ లో టన్నుల కొద్ది చెత్త చెదరం పేరుకొని పోయింది. ఒకా నొక సమయంలో డంపింగ్ యార్డ్ లో మంటలు చెలరేగి శ్రీనివాస నగర్ వరకు దుర్వాసన వెలువడింది. దుర్వాసన నిత్యం హరిజనపేట వాసులు అనుభవిస్తూ ఊపిరితిత్తుల వ్యాధులకు గురౌతున్నారు. ప్రజల సమస్యను వార్డ్ కౌన్సిలర్ పిచ్చుక నాగార్జున కౌన్సిల్ దృష్టికీభ్తేసుకొని రావడం తో అధికారుల్లో చలనం వచ్చింది. దేశవ్యాప్తంగా డంపింగ్ యార్డ్ సమస్య ఉండడంతో కేంద్ర,రాష్ట్ర నిధులతో డంపింగ్ యార్డ్ లో పేరుకుపోయిన చెత్తను తొలగించడానికి ప్రభుత్వం సిద్ధం అయింది. ఈ నేపథ్యంలోనే అన్ని ప్రాంతాల్లో డ్రోన్ సర్వేలు చేపట్టింది. నంద్యాలలో దాదాపు 55 వేల మెట్రిక్ టన్నుల చెత్త,చెదారం ఉన్నట్టు ప్రభుత్వానికి నివేదికలు పంపింది. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డ్ లో ఉన్న చెత్తను తొలగించడానికి ఇతర ప్రాంతానికించెందిన ఒక కాంట్రాక్టర్ 5.50 కోట్లకు టెండర్ దక్కించుకున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం గత ఏడాదే పనులు పూర్తి కావల్సివుంది. అనివార్యకారణాలో ఏమో నేటికీ తరలింపులో జాప్యం జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం డంపింగ్ యార్డ్ లో ఉన్న చెత్తా,చెదారం మూడు విభాగాలుగా విభజించి తరలించాలి. అందులో మూడో భాగం లో వచ్చే వ్యర్థాలు ఎక్కడైనా రోడ్డు లెవెలింగ్ కు ఉపయోగిస్తారు. కాంట్రాక్టర్ మాత్రం వాటిని మూడు విభాగాలుగా కొద్దిగా చేసి ఎక్కువ శాతం కుందూ పరీవాహక ప్రాంతాల్లో తరలించి చేతులు దులుపుకున్నారు. ప్రథమ నంది వెనుక వైపు ,ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక, మున్సిపాలిటీలో ఒక ప్రధాన అధికారి వద్ద పియే గా పనిచేస్తున్న ఒకరు నూతనంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్ కు కూడా డంపింగ్ యాడ్ వ్యర్థాలతోనే లెవెలింగ్ చేస్తున్నారు. లెవెలింగ్ చేయడం తప్పు కాదు కుందూ పక్కన వుండడం విశేషం. గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక వ్యర్థాలు లెవెలింగ్ చేయడంతో కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థుల జీవితాలతో ఆడు కుంటారా అని మంద లించినట్టు సమాచారం. కొద్ది రోజుల క్రితం బండి ఆత్మకూరు మండలం ఎర్రగుంట్ల, పలుకూరు సమీపంలోని రామతీర్థం ప్రాంతాల్లో కలుషిత నీరు త్రాగడం వల్ల 40 మంది అస్వస్థతకు గురైనా విషయం తెలిసిందే. ఆ రెండు గ్రామాల్లో తెలియకుండా కలుషితం అయ్యి ప్రజలు అనారోగ్యాలకు గురయ్యారు నంద్యాల లో డంపింగ్ యార్డ్ వ్యర్థాలు కుందూ పరీవాహక ప్రాంతాల్లో నిల్వలు వున్నాయని తెలిసిన అధికారులు చర్యలు చేపట్టకపోవడం విశేషం. కుందూ క్రింద ఉన్న గ్రామాల్లో అధిక శాతం తాగునీటికి కుందూ నితిన్ ఉపయోగిస్తారు. గతంలో కుందూ కలుషితం కావడంతో వేలాది చేపలు మృతిచెందిన విషయం విదితమే. అప్పట్లో ఒక ఫ్యాక్టరీ,ఒక ఆసుపత్రి నుంచి వచ్చే వ్యర్థాలుగా గుర్తించారు. శాశ్వత చర్యలు మాత్రం నేటికీ లేవు. తాజాగా డంపింగ్ యార్డ్ వ్యర్థాలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వర్షం పడితే చాలు ఆ వ్యర్థాలు కుండీలో కలిస్తే మాస్ ఆరోగ్యాల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మున్సిపాలిటీకి ఏ అధికారి వచ్చినా నాలుగు రాళ్ళు వెనకేసుకుంధామా అని ఆలోచిస్తారే కానీ ప్రజా సమస్యలపై దృష్టి మాత్రం పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే దాదాపు 1500 లారీలు డంపింగ్ యార్డ్ నుంచి చెత్తా,చెదారం నిల్వలు అక్కడ చేరినట్టు తెలుస్తోంది. డంపింగ్ యార్డ్ నుంచి కుందూ ప్రాంతాల్లో తరలిస్తున్న కాంట్రాక్టర్ కు పండుగే పండుగ. 5.50 కోట్లకు మొదటి బిల్లు మూడొంతులు వస్తుంది. అక్కడినుంచి ఇక్కడికి తరలిస్తే అబ్బో ఎంత డబ్బు అని కొందరు కాంట్రాక్టర్లు నోర్లు వెలబెట్టుతున్నారు. ఉన్నతది కారులు ప్రజల ప్రాణాలపై దృష్టి పెట్టి కుందూ పరీవాహక ప్రాంతాలు ప్రజల ప్రాణాలు కాపాడుతారని ఆశిద్దాం.

## ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నాం


**ఏపీ స్పెషాల్టీ ఆస్పత్రుల సంఘం**



ఆంధ్ర ప్రగతి అమరావతి మే 20: రాష్ట్రంలో మే 22 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఏపీ ప్రభుత్వానికి స్పెషాల్టీ ఆస్పత్రుల సంఘం తెలిపింది. ఈ మేరకు సోమవారం ఓ లేఖ రాసింది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో లక్ష్మీ షాకు రాసిన ఈ లేఖలో పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడాన్ని ప్రస్తావించింది. మే 22 నుంచి ఏపీలోని వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తామని స్పష్టం చేసింది. గతేడాది ఆగస్టు నుంచి ఉన్న రూ.1,500 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేసింది.
సుదీర్ఘ కాలంగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వస్తోందని స్పెషాల్టీ ఆస్పత్రుల సంఘం తెలిపింది. పలుమార్లు లేఖలు రాసినా ఇప్పటివరకు కేవలం రూ.50 కోట్లు మాత్రమే చెల్లింపులు చేశారని లేఖలో పేర్కొంది.


## ఆర్ కొత్తపల్లి గ్రామంలో పిడుగుపాటు

**12 పొట్టేళ్లు మృతి. రూ 1.50 లక్షల నష్టం.**



ఆంధ్ర ప్రగతి రుద్రవరం మే 20:మండలంలోని ఆర్ కొత్తపల్లి గ్రామంలో పిడుగుపాటుకు రూ 1.50 లక్షల విలువచేసే 12 పొట్టేలు మృతి చెందాయి. గ్రామస్తుల వివరాల మేరకు గ్రామానికి చెందిన కొట్టాలపల్లి కాశీం సాహెబ్ అనే రైతుకు చెందిన గొర్రెల మంద పై గ్రామ సమీపంలో గాలివాన వీచి పిడుగు పడటంతో షాక్ గురి పొట్టేళ్లు మృతి చెందాయన్నారు. దీంతో రైతుకు తీవ్ర నష్టం ఏర్పడిందన్నారు. పశు వైద్యాధికారులు స్పందించి బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం అందేలాచర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## స్పందించని 108 సిబ్బంది.



ఆంధ్ర ప్రగతి మహానంది మే 20: మహానంది మండలం బుక్కాసం పెట్రోల్ బంక్ వద్ద ఒక మహిళ గాయపడిన సంఘటనకు సంబంధించి సమాచారం అందజేస్తే 108 సిబ్బంది స్పందించలేదని సమాచారం. మహానంది నుండి నంద్యాల వైపు మోటార్ సైకిల్ పై వస్తున్నా ఒక మహిళ బుక్కాపురం పెట్రోల్ బంకు వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద ఎగిరి పడడంతో గాయాలైనట్లు తెలుస్తుంది. దీనిని గమనించిన స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించిన స్పందించకపోవడంతో పాటు ఇతర ప్రాంతాల నుండి 108 వాహనం రావాల్సి ఉంటుందని స్థానికంగా అందుబాటులో లేదని తెలియజేసినట్లు సమాచారం అందించిన వ్యక్తులకు తెలియజేసినట్లు తెలిసింది. దీంతోపాటు 108 ఫోన్ చేసిన వ్యక్తి వివరాలు గాయపడిన వ్యక్తులు మీకు ఏమవుతారు మీరు వివరాలు తెలియజేస్తే నమోదు చేసుకుంటామని 108 మాత్రం అందుబాటులో లేదని పొంతన లేని సమాధానాలు చెప్పి సిబ్బంది విచిత్రంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో సంఘటన జరిగిన ప్రాంతం ముం దు నుంచి 108 వాహనం కొంతటి సేపు తరువాత అదే దారిలో వెళ్లినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సహజంగా ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడినప్పుడు సమీపంలోని వ్యక్తులు మానవతా కోణంలో 108కు సమాచారం అందిస్తారు. మహానంది నంద్యాల రహదారిలో బుక్కాపురం పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద ఎలాంటి సూచికలు లేకపోవడంతో చాలామంది వాహనదారులు అక్కడ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తుంది. అధికారులు స్పందించి అక్కడ స్పీడ్ బ్రేకర్ తొలగిస్తారా లేక సూచికలు ఏర్పాటు చేస్తారా అనేది తేలాల్సి ఉంది.

# మేడిగడ్డ రిపేర్లలో ఆలస్యంగా నిర్ణయం

## వర్షాకాలం ముంచుకొస్తున్న వేళ సమయం వృధా

హైదరాబాద్,మే18 ఎన్నికలతో పాటు, కొంత ఉదాసీనత కారణంగా మేడిగడ్డ వద్ద రోణ చర్యలకు ఆలస్యంగా అయినా నిర్నయం తీసుకున్నారు. ఈయేడు త్వరగా రుతుపవనాలు వస్తాయని అంటున్నారు. మరో పక్షం రోజులే ఇందుకు గడువు ఉంది. వర్షాలకు ముందే మరమ్మత్తులు చేస్తేనే నీటిని ఎత్తి పోయడానికి అవకాశం ఉంటుంది. ఈ పదిహేను రోజుల్లో ఇది పూర్తవుతుందా అన్నదే అనుమానం. వర్షాకాలంలో మేడిగడ్డ బరాజ్ వద్ద చేపట్టాల్సిన రక్షణచర్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ చేసిన మధ్యంతర సిఫారసులకు సంబంధించిన పనులను ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రారంభించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల రక్షణకు చేపట్టాల్సిన సత్వర పనులపై ఇరిగేషన్‌శాఖ ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా ఈఎన్సీ జనరల్, ఈఎన్సీ (ఓఅండ్‌ఎం), సీఈ (సీడీవో), రామగుండం సీఈతో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటయిన జ్యుడీషియరీ కమిషన్‌కు ఇప్పటివరకు 3 ఫిర్యాదులు మాత్రమే అందాయి. ప్రాజెక్టుపై సలహాలు, సూచనలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు కమిషన్ ప్రత్యేకంగా బాక్సులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 31 వరకు ఈ పక్రియ కొనసాగనుంది. ఫిర్యాదులు చేసేవారెవరైనా సరే సాక్ష్యాలతో అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని కమిషన్ స్పష్టం చేసింది. దీంతో ఫిర్యాదులు ఎక్కువగా రాలేదని తెలిసింది. కాగా కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ జూన్ 6న రాష్ట్రానికి రానున్నారని సమాచారం.ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులను గడువులోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులకు రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా ఆదేశాలు జారీ చేశారు. పనుల నిర్వహణలో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లపై ఇప్పటికే ప్రత్యేకంగా కమిటీని వేయగా నివేదికను సైతం సమర్పించింది. ఈ నేపథ్యంలో మరోసారి ఎస్‌ఎల్‌బీసీ పనుల ప్రారంభంపై ఇరిగేషన్ సెక్రటరీ శుక్రవారం నిర్మాణ ఏజెన్సీలు, ఇంజినీర్ అధికారులతో చర్చించారు. బరాజ్‌లోని బ్లాక్-7లో 8 గేట్లను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టింది. వరద ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూడాలని, అందుకు గేట్లను పూర్తిగా తెరచి ఉంచాలని, ఆటంకంగా మారిన ఇసుకమేటలు, రాళ్లను తొలగించాలని ఎన్‌డీఎస్‌ఏ కమిటీ సూచించింది. అందుకు సంబంధించిన పనులను చేట్టాలని బరాజ్ నిర్మాణ ఏజెన్సీకి ఇరిగేషన్‌శాఖ ఇటీవలనే ఆదేశాలను జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఏజెన్సీ మొత్తం 8 గేట్లలో ఇప్పటికే ఒక గేటును ఎత్తి పెట్టింది. మరో 2 మినహా మిగతా గేట్లను సైతం సాంకేతిక ఇబ్బందులు లేకుండానే ఎత్తే అవకాశముందని ఎల్‌అండ్‌టీ అధికారులు వెల్లడిస్తున్నారు.

# ఆరు నెలలకే కాంగ్రెస్‌పై అసంతృప్తి

### - ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడ్డది

### -ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఈటెల

ఖమ్మం,మే 20 ఆరు నెల్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర నిరాశ ఏర్పడిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్ తెలిపారు. ప్రజల్లో ఇంటి అసహనం చూడలేదన్నారు. ఇచ్చిన హామీలను నిలుపుకోవడంలో కాంగ్రెస్ విఫలం అయ్యిందన్నారు. ఈనెల 27న ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని... బీజేపీ అభ్యర్థిగా 40 ఏళ్లుగా సిద్ధాంతాన్ని నమ్ముకుని ఎత్తిన జెండా దింపని గుజ్జుల ప్రేమెందర్ రెడ్డిని ఎమ్మెల్సీ బరిలో నిలిపామని ఈటెల రాజేందర్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ఆనాడే ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించినా నేటికీ అమలు చేయకపోవడం పట్ల ఉద్యోగులు బాధతో ఉన్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల వేతనాలు చెల్లింపు విధానంతో మళ్ళీ ఆర్టీసీని దివాలా తీసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సోనియా గాంధీ ,రాహుల్ గాంధీలు నిరుద్యోగ యువతకు 4 వేలు ఇస్తా అని హామీ ఇచ్చిన ఇప్పటివరకు ఇవ్వలేదని విమర్శించారు. ఉద్యోగులకు ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్ కింద ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. మంత్రులు స్కూల్, కాలేజీ యాజమాన్యాలతో సమావేశాలు పెట్టి ఓట్లు వేయాలని బలవంతం చేస్తున్నారన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో అండగా ఉన్నవారికి జీతాలు ఇవ్వకుండా ఉండటం సమంజసం కాదన్నారు. జీవో నెంబర్ 317 విషయంలో కేసీఆర్‌ను తప్పు పట్టామని.. నేడు ఉద్యోగుల మీద లాఠీ ఛార్జ్ చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు.

# జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పిన ప్రజలు

### ఎన్‌డిఏ అధికారంలోకి రావడం ఖాయం- ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం,మే20:టీడీపీ గెలుపే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో ప్రతి కార్యకర్త పనిచేసారని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల పెరిగిన ధరలతో సామాన్యుడి జీవనం అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. అందుకే ప్రజలంతా ఎన్‌డి కూటమికి మద్దతు తెలిపారాని అన్నారు జూన్ 4న ఫలితాలతో జగన్ ఇంటికి వెళ్లడం ఖాయమని అన్నారు. అన్నక్యాంటీన్, నిరుద్యోగ భృతి, ఎస్సీ, బీసీ, ఇతర కార్పొరేషన్ల ద్వారా పథకాలు, విదేశీ చదువులకు ఇచ్చే ప్రోత్సాహకాలు నిలిపివేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించేలా ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదన్నారు. హామీలు గుప్పించడం, మభ్యపెట్టడం, ప్రజలు నెత్తిన భారం వేయడం ఐదేళ్లుగా అలవాటుగా మారిందన్నారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని దీమా వ్యక్తంచేశారు. వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. వైసీపీ పాలనలో ఊరికో ఉన్మాది తయారయ్యారని.. ప్రభుత్వ ఉదాసీన వైఖరితోనే కిరాతకులు పెట్రేగారని అన్నారు. ఆడబిడ్డకు కష్టమొస్తే గన్ కంటే ముందు వస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న మృగాళ్లను గన్‌తో కాల్చేందుకు జగన్ ఎందుకు రాలేదని అన్నారు. ఇళ్లలోకి చొరబడి మహిళలను ఎత్తు కెళ్లి అత్యాచారాలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. మహిళలను వేధించిన కేసుల్లో పలువురు వైసీపీ నేతలే ఉన్నారని వెల్లడించారు. ఇవన్నీ గమనించి ప్రజలు కూటమికి ఓటేశారని అన్నారు.

## పోలవరంతోనే సమస్యలు తీరుతాయి



కడప,మే20రాయలసీమవాసుల ఉద్యమ ఫలితంగానే పోలవరం ప్రాజెక్టు వచ్చిందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అన్నారు. అందువల్ల రాయలసీమలోని ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయి నీటి వాటా పొందే వరకు నిరంతర పోరాటాన్ని చేయాలన్నారు. రాయలసీమకు సాగునీటిపై చట్టబద్ధ హక్కు కల్పించాలని, సీమ ప్రాజెక్టులను నిర్మించాలని ఉద్యమాన్ని తీవ్రతరం చేసినప్పుడు ఏవో ఒక ప్రాజెక్టును ప్రారంభించడం ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందన్నారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వం పోలవరంపై ముందు శ్రద్ధ పెట్టాలని అన్నారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కూడా అలాంటిదేనన్నారు. ఈ పథకం ద్వారా రాయలసీమ శాశ్వతంగా సస్యశ్యామలం అవుతుందని పేర్కొనడం అవాస్తమన్నారు. రాయలసీమ సాగునీటి సాధన ఉద్యమ ప్రభావాన్ని నీరుగార్చేందుకే జగన్ ప్రభుత్వం తాత్కాలిక పథకాలను హడావుడిగా ప్రారంభించిని విమర్శించారు. తెలుగుగంగ, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూ, ఆయకట్టు పరిరక్షణకు హామీ దక్కాల్సి ఉందన్నారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా అనంతపురం జిల్లాలోని 1.18 లక్షల ఎకరాలు, జిల్లాలోని 80 వేల ఎకరాలు, హెచ్చెల్సీ కింద 2.95 లక్షల ఎకరాలకు, కేసీ కెనాల్ కింద 2.65 లక్షల ఎకరాలకు నీరందుతుందా అని ప్రశ్నించారు. గోదావరికి, కృష్ణా జలాలను మళ్లించే దుమ్ముగూడెం ప్రాజెక్టు గురించి ఎవరూ ప్రశ్నించడం లేదని విమర్శించారు.

## మిర్చి రైతులకు స్టోరేజీలను ఇవ్వాలి

### ఇష్టారాజ్యంగా అద్దెలు పెంచడం తగదు

గుంటూరు,మే20: మిర్చి రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ధర తగ్గిపోతుందని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుందామంటే వాటి యజమానులు కూడా ఇష్టారాజ్యంగా అద్దెలు పెంచారని జిల్లా రైతు సంఘం నాయకులు విమర్శించారు. అక్రమంగా వసూళ్లు చేస్తున్నా అధికారులు, పాలకవర్గం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధిక కమీషన్, మచ్చుల పేరుతో మిర్చియార్డులో అధిక వసూళ్ల దోపిడీని అరికట్టాలని అన్నారు. ఇప్పటినుంచే చర్యలు తీసుకుని వచ్చే మార్కెట్ నాటికి పక్కా ప్రణాళిక అమలు చేయాలన్నారు. కోల్డ్‌స్టోరేజ్‌లో సన్న, చిన్నకారు రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని, మార్క్‌ఫెడ్‌కు వేయి కోట్లు కేటాయించి కొనుగోళ్లు ప్రారంభించాలని అన్నారు. అలాగే కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు రూ.50 వేలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు, దళారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతుల పుట్టి ముంచేశారన్నారు. జగన్ రెడ్డి పాలనలో ఒక్క నెల్లూరులోనే రూ.3 వేల కోట్లు దోచుకున్నారని సోమిరెడ్డి అన్నారు. ఈ స్కామ్‌పై సీఐడీ కాదు సీబీఐ లేదా జ్యూడిషియల్ ఎంక్వయిరీ జరిపితేనే నిజాలు నిగ్గు తేలుతాయని సోమిరెడ్డి తెలిపారు. ఇదిలావుంటే మిల్లర్లు మాయచేసి రైతులను నిలువునా ముంచుతు న్నారని కృష్ణా జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పట్టపు నాని ఆవేదన వ్యక్తం చేశారు.

# రుద్రవరంలోఉరుములు మెరుపులు భారీగాలులతో వర్షం బీభత్సం

### -నేలకొరిగిన భారీ వృక్షాలు విద్యుత్ స్తంభాలు



ఆంధ్ర ప్రగతి రుద్రవరం, మే 20: మండల కేంద్రమైన రుద్రవరంతోపాటు పలు గ్రామాలలో ఉరుములు మెరుపులు భారీ గాలులతో వర్షం బీభత్సం సృష్టించింది. సాయంత్రం మండల కేంద్రమైన రుద్రవరంలో ఉరుములు మెరుపులు భారీ గాలితో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో రహదారులతోపాటు కాలనీలో పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు భారీ వృక్షాలు నేల కులాయి. మండల పరిషత్ కార్యాలయం వద్ద స్తంభాలు నేల కులాయి. కార్యాలయం సమీపంలో ఉన్న గాలి మిషన్ వద్ద ఓ వృక్షము విద్యుత్ స్తంభము నేల పులి ఆటోపై పడడంతో ఆటో దెబ్బతింది. పక్కనే కాల్ మిషన్లో ఉన్న కొందరు భయంతో ఉరుములు మెరుపులు భారీ గాని వర్షాన్ని కూడా లెక్కచేయకుండా బయటికి పరుగులు తీశారు. గాలివాన బీభత్సం సృష్టించడంతో గ్రామంలో జరుగుతున్న వారపు సంత మార్కెట్లో వ్యాపారులు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భయంకరమైన ఉరుములు మెరుపులు భారీ గాలివానతో గ్రామస్తులు భయాందోళన గురయ్యారు. విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

## జూన్ 8న చేపప్రసాదం పంపిణీ

### వెల్లడించిన బత్తిన కుటుంబ సభ్యులు

హైదరాబాద్,మే20 మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఏడాది.. బత్తిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం అందిస్తున్నారు. ఈ ఏడాదికూడా చేప ప్రసాదం పంపిణీకి బత్తిని ఫ్యామిలీ సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన వివరాలను వారు మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది మృగశిర కార్తె జూన్ 8న శనివారం ఉదయం పదకొండు గంటలకు ప్రవేశిస్తుంది. జూన్ 8 ఉదయం పదకొండు గంటల నుంచి జూన్ 9వ తేదీ ఉదయం పదకొండు గంటల వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందని తెలిపారు. చేప ప్రసాదం పూర్తిగా ఉచితంగా భక్తులకు అందిస్తామని అన్నారు. వివిధ ఫౌండేషన్ల సహకారంతో.. మెడికల్ సర్వీస్, భోజన సౌకర్యం, మంచి నీటి సరఫరా 24 గంటల పాటు ఉచితంగా భక్తులకు ఇస్తామని చెప్పారు.ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాస సంబంధ వ్యాధుల నివారణకు చేప మందు ప్రసాదాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. చేప ప్రసాదం పంపిణీకి గత ప్రభు త్వాలు అన్ని ఏర్పాట్లు చేసిన విధంగానే.. ఈ ప్రభుత్వాన్నిసైతం తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. చేప ప్రసాదం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

## పండుకునే పరుపుల్లో నోట్ల కట్టలు

### ఐటి దాడుల్లో ఆగ్రావ్యాపారి ఇంట్లో పట్టివేత

ఆగ్రా,మే20 పేదవాడు డబ్బు సంపాదించటం కోసం రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడుతుంటే, ఉన్నోడు మాత్రం డబ్బును ఎక్కడ దాచాలో కూడా తేలిక సతమతం అవుతున్నాడు.మాములుగా డబ్బును ఇంట్లో బీరువాలో దాచుకుంటాం, మరీ ఎక్కువ ఉంటే బ్యాంక్లో డిపాజిట్ చేస్తాం.

కానీ, ఇంట్లో మంచం మీద పరుపులా పరచడం ఎప్పుడైనా చూశారా. ఆగ్రాలో ఐటీ అధికారులు జరిపిన సోదాల్లో చోటు చేసుకున్న ఘటన చూస్తే అవాక్కవుతారు. ఆగ్రాలోని ఓ షూ వ్యాపారి ఇంట్లో ఐటీ అధికారులు జరిపిన సోదాల్లో కట్టల కొద్దీ డబ్బు బయటపడింది.

ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా 60కోట్ల రూపాయల డబ్బు మంచం మీద పరుపులా పరిచి ఉండటం చూసి అధికారులు సైతం అవాక్కయ్యారు. కట్టలు కట్టలుగా బయటపడ్డ డబ్బును అధికారులు సీజ్ చేశారు. శనివారం రాత్రి ఆరు చోట్ల జరిపిన సోదాల్లో బయటపడ్డ డబ్బును కౌంట్ చేయటానికి 6 కౌంటింగ్ మిషన్లు కావాల్సి వచ్చింది అధికారులకు. ఈ సోదాల్లో 60కోట్ల నగదుతో పాటు పలు డాక్యుమెంట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు అధికారులు.

## ఫెడెక్స్ పేరుతో వచ్చే కాల్స్‌ను నమ్మొద్దు..

### ప్రజలకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచన



ఇటీవల ఫెడెక్స్ కొరియర్ పేరుతో చాలా మందికి కాల్స్ వస్తున్నాయి. ఆధార్ నెంబర్‌తో పార్సిల్ వచ్చిందని.. అందులో అక్రమంగా రవాణా చేస్తున్న మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయని భయాందోళనకు గురి చేస్తున్నారు.డ్రగ్స్ రవాణా కేసులో శిక్షలు కఠినంగా ఉంటాయని.. కేసుల నుంచి తప్పించుకునేందుకు రూ.లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఎందరో సైబర్ నేరగాళ్ల బారినపడి లక్షల్లో సొత్తును నష్టపోయారు.ఈ క్రమంలో తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఫెడెక్స్ పార్సిల్స్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌ని నమ్మొద్దని.. పోలీసులమని చెప్పగానే భయపడి డబ్బులు ఇవ్వొద్దని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానం వచ్చినా.. మోసపోయినా వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.అయితే, సైబర్ నేరగాళ్ల బారినపడ్డ వారిలో ఎక్కువ మంది విద్యావంతులే ఉండడం ఆందోళనకరమన్నారు. సైబర్ నేరగాళ్లు మోసాలకు కొత్త కొత్త వాటిని ఎంచుకుంటున్నారన్నారు. ఇంతకు ముందు ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, రెంట్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడ్డారన్న ఆయన.. తాజాగా ఫెడెక్స్ పేరుతో మోసాలకు తెరలేపారని చెప్పారు.